జయజయ శంకర



హరహర శంకర

సంపుటి : 1 సంచిక : 3

శ్రీః

# కామకోటి వాణి

శ్రీ శుభకృత్ కార్తీక మాసం - అక్టోబర్ 2022



శ్రీ కంచికామకోటి పీఠం, కాంచీపురము

ఆదిశంకర భగవత్పాదులు తమ ఆధ్యాత్మిక ప్రస్థానంలో పీఠాధిపత్యం వహించిన మూలామ్నాయ పీఠమే శ్రీకంచికామకోటి పీఠం 68వ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి, 69వ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతీస్వామి పీఠాధిపత్యం వహిస్తున్న పుణ్యకాలంలో సన్యాసదీక్షను స్వీకరించిన బాలమేధావి శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు 1983లో సన్యాసదీక్షకు అనుమతించి దీక్షా స్వీకారం జరుగుతున్న సమయంలో మహాస్వామివారు ఆయనను కనులారా చూస్తూ అందరి సమక్షంలో “మళ్ళీ ఆది శంకరులవారు ఈ అవనిపై అవతరించారు” అని ఆశీర్వదించారు. శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతిస్వామివారి బ్రహ్మైక్యానంతరం 70వ పీఠాధిపతిగా కంచి పీఠాన్ని అధిరోహించి పరమాద్భుతమైన ధర్మపాలనతో పీఠాన్ని నడిపిస్తున్న జ్ఞానమూర్తి శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్రసరస్వతీ స్వామివారు. వేద వేదాంగములతో పాటు సకలకళా వైదుష్యం ఆయన ప్రత్యేకత. అన్నిటినీ మించి స్వామివారు ప్రదోషపూజలో ప్రదక్షిణం చేస్తున్నప్పుడు స్వామివారి శారీరక కదలికలు సాక్షాత్ కామాక్షీ అమ్మవారిని తలపిస్తూ హృదయానందాన్ని కలిగిస్తాయి.



# ‘నూతనం అవసరం, ప్రాచీనం అత్యవసరం’

**స్వర్ణలతగారు : ఓం నమో వేంకటేశాయ ! ఈనాటి గురుసన్నిధి కార్యక్రమంలో మనం కంచిపీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీస్వామివారిని అడిగి కొన్ని విషయాలు తెలుసుకుందాం ! స్వామీ ! మానవునికి గురువు యొక్క ఆవశ్యకత గురించి చెబుతారా?**

**స్వామివారు :** మానవ జీవితంలో గురువు యొక్క అవసరం 'మార్గదర్శనం' కోసం మనకి ఖచ్చితంగా మొదటి గురువుగా తల్లిదండ్రులు ఉంటారు. భారతదేశ చరిత్రలో మాతృదేవోభవ, పితృదేవోభవ అనేది ప్రధానం. మొదటి గురువు తల్లి, రెండవ గురువుగా తండ్రి ఉంటాడు. గురు శబ్దానికి **'గు శబ్దస్తు అంధకారః స్యాత్, రు శబ్దః తన్నివర్తకః'** చీకటిని తొలగించేవారు గురువు. అలా మనకి జీవితంలో అక్షరాభ్యాసం చేయించి, 'అక్షరం బ్రహ్మ పరమం స్వభావో ఆధ్యాత్మముచ్యతే' అని పరమాత్మ విజ్ఞానమైన అక్షరాన్ని కూడా నేర్పటానికి గురువులు మనకు అవసరం. మన మనస్సులో ఉండే అంధకారం, కోపం, ద్వేషం, అసూయ, అశ్రద్ధ, ఆడంబరం, ఆలస్యం ఇలాంటి అవసరంలేని మరియు ఇబ్బంది కలిగించే చెడ్డ అలవాట్లను తొలగించి శ్రద్ధ, భక్తి, వినయము, ప్రేమ, స్నేహం, సత్యం, నిష్ఠ, సుశ్రూష, సేవాభావం ఇవన్నీ కలిగించటానికి ఒక మంచి గురువుల యొక్క ఉపదేశము, ఆయన మార్గదర్శనం అవసరం. 'చక్కని రాజమార్గము' అని త్యాగరాజు చెప్పినట్టుగా రజోమార్గం కాకుండా రాజమార్గాన్ని చూపించటానికి ఒక గురువు అవసరం.



**స్వర్ణలతగారు : గురుసన్నిధి ప్రతిఒక్కరికీ అవసరం, ఆ గురుసన్నిధి లేకపోతే జీవితమే అనవసరం. ఆ గురుసన్నిధి గురించి చెబుతారా ?**

**స్వామివారు :** మనకు 'నిధి అవసరం, సన్నిధి అవసరం'. ఆ సన్నిధి అనేది భగవంతుని సన్నిధి. (వేంకటేశ్వరస్వామి సన్నిధి.) అలా గురువు సన్నిధిలో మనకు మంచి ప్రేరణ, స్ఫూర్తి, శ్రద్ధ కలుగుతాయి. అందుకని మంచి గురువుని మనం వెతికి తెలుసుకోవాలి. మనమే వెతకాలి. శిష్యునిగా ఉండే మనం గురువుని వెతకాలి. 'సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం గురుమేవాభిగచ్ఛేత్' మనం గురువుగారిని వెతుక్కునేందుకు వెళ్ళాలి. 'శిష్యస్తేహం శాధిమాం త్వాం ప్రపన్నం' అని భగద్గీతలో చెప్పినట్లుగా మనం వెళ్ళి "నేను మీ శిష్యుణ్ణి మీకు ప్రణామాన్ని అర్పిస్తున్నాను. నాకు మంచిదారిని చూపించండి" అని మనం గురువుగారిని సేవించుకోవాలి.

**స్వర్ణలతగారు : అందరికీ గురువు దొరుకుతాడంటారా?**

**స్వామివారు :** ఆ ! అందరికీ గురువుగా జగద్గురువులైన కృష్ణపరమాత్మ ఉంటారు. మన భారతదేశం యొక్క సౌభాగ్యం మంచి తల్లితండ్రులు దొరుకుతున్నారు. వారే మొదటి గురువులు. అది లోకంలోనే ఒక ప్రత్యేకత, విశిష్టత ఉన్న విషయం. మన భారత దేశంలో సనాతనధర్మంలో, హైందవమతంలో ఉన్న గొప్ప విషయం. అంటే సంసార జీవితంలో భక్తి, తత్వశాస్త్రము, త్యాగం, సేవాభావం ముఖ్యమని మనం నమ్ముతాము. సంసారంలో 'సారం' ఏదో గ్రహించటానికి ఇక్కడ తల్లితండ్రులు ప్రయత్నం చేస్తారు. మంచి సంతానం కలగాలి అనుకుంటారు. అంటే అది భౌతికపరమైన లౌకికపరమైన ఒక ఆడంబరం కాకుండా సంసార జీవితం అనేది భారతదేశంలో సత్సంతాన ప్రాప్తి కోసం అంటారు. అలా 'సంతతిః శుద్ధ వంశ్యా హి పరత్రేహ చ శర్మణే' మంచి సంతానం అనేది ఇహలోకంలో మనకు సుఖాన్ని, సంతోషాన్ని కలిగిస్తుంది. పరలోకంలో స్వర్గాది

సౌఖ్యం కూడా కలిగిస్తుంది. అందుకని సత్సంతానం అనేది ముఖ్యమైనది. గురువు అనేవారు మనకు ఆచార్యపురుషుడు. మన సమాజ వ్యవస్థలో ఒక గురువుని సేవించుకోవడం, కులగురువులు అని ఉండటం, ఒక కుటుంబానికి గురువు అని ఉండటం, వాళ్ళు మంచిరోజులు చెప్పటం, మంచి ఉపదేశాలు చెప్పటం, వారు చెప్పిన దారిలో మనం కులదైవాన్ని పూజించుకోవటం లాంటి మంచి కార్యక్రమాలు చేస్తున్నాం. అందుకని గురువు వ్యవస్థ అనే ఏర్పాటు మన దేశంలో అనాదిగా ఉంది.

**స్వర్ణలతగారు : ఉంది ! కానీ పూర్వకాలంలో బాగా ఉండేది. అందరికీ గురువులు ఉండేవాళ్ళు. ఎవరెవరికి వాళ్ళ పురోహితులు ఉండేవాళ్ళు. కాని ప్రస్తుత సమాజంలో అంత తీరిక లేదు, ఆ వ్యవస్థ కూడా ఇప్పుడు కుంటుపడింది. ఇప్పుడు ఆ వ్యవస్థ మళ్ళీ రావాలంటే మనం ఏమి చెయ్యాలి. గురువు దొరకాలంటే ఏం చెయ్యాలి.**

**స్వామివారు :** మన ప్రయత్నం అవసరం. భగీరథ ప్రయత్నం కూడా మనకి అవసరం పడుతుంది. మనం కొత్తని వెతుకుతూ వెళుతుంటాం. కంప్యూటర్ కావాలి, ఇంకా కొత్త విజ్ఞానం కావాలి అని వెతుకుతుంటాం. ఆధునికత మనకు అవసరమే మరియు ఉపయోగకరం కూడా దాంట్లో సందేహం లేదు. కానీ నూతనం అవసరం, ప్రాచీనం అత్యవసరం. ప్రాచీనమనేది ఒక విజ్ఞానం, ఒక సమాజతత్త్వం. ప్రాచీనమనేది **'లోకాస్సమస్తా సుఖినోభవంతు'**, **'వసుధైక కుటుంబం'** అనే తత్త్వం. కాబట్టి ప్రాచీనాన్ని మనం దూరం పెట్టకూడదు. కాళిదాస కవి 'పురాణమిత్యేవ న సాధు సర్వం న చాపి కావ్యం నవమిత్యవద్యం' అని చెప్పారు. పాతవి అయినంత మాత్రాన అన్నీ గొప్పవి కావు, కొత్తది కాబట్టి దూరం పెట్టవలసిన అవసరం లేదు. అందుకని ఏది నిజమో, ఏది పరమార్థమో, ఏది తత్త్వమో మనం గ్రహించాలి. మన ప్రాచీనమైన శాస్త్రాలలో తత్త్వాలున్నాయి. అందుకని దీనికొరకు ఒక ఏర్పాటు చేసుకొని తెలుసుకోవటం జరగాలి.

**స్వర్ణలతగారు : అంటే ప్రతిమనిషికీ అమ్మనాన్నల ప్రోత్సాహం ఉండాలి. అప్పుడు గురువువైపుకి ఆ వ్యక్తి నడుస్తాడంటారా ?**

**స్వామివారు : తల్లిదండ్రులు పునాది అయితే మెట్లు గురువు**




అనుకోవచ్చు.

**స్వర్ణలతగారు : ఒకవేళ తల్లితండ్రులకే ఆ విజ్ఞానం, సంప్రదాయం లేకపోతే ఈ సామాన్యుడు ఎవరిని నమ్ముకోవాలి ?**

**స్వామివారు :** శంకరాచార్యులు ప్రశ్నోత్తర రత్నమాల అనే స్తోత్రంలో ఇదే చెబుతున్నారు. 'కో గురుః' ఎవరు గురువు ? 'అధిగత తత్త్వః శిష్యహితాయ ఉద్యతః సతతం' తత్త్వాన్ని తెలుసుకున్నవారు, అంటే చదవటం, చెప్పటం మాత్రమే కాదు వారు అనుభవంలో కూడా తీసుకొచ్చినవారు. ఎవరైతే శాంతస్వభావులు, లోకహితాన్ని కోరుకుంటున్నారో వాళ్ళు 'అధిగత తత్త్వః శిష్యహితాయ' శిష్యుల హితవు కోరే వారుగా ఉంటారు. తల్లిదండ్రులు కొన్ని సమయాల్లో కొంచెం గట్టిగా చెప్పవలసి వస్తుంది. అయితే దాంట్లో హితం ముఖ్యం. ఇది తినవచ్చు, తినకూడదు, ఇది చూడవచ్చు, చూడకూడదు, ఇక్కడికి వెళ్ళవచ్చు, వెళ్ళకూడదు ఇలాంటివి చెప్తారు. కొన్ని సమయాల్లో అందంగా చెప్తారు. కొన్ని సమయాల్లో గట్టిగా చెప్పవలసి వస్తుంది. కానీ దాంట్లో ఉన్న ఉద్దేశ్యం మంచిదై ఉంటుంది. మన అబ్బాయిగాని, అమ్మాయిగాని పైకిరావాలి, కీర్తివంతులుగా ఉండాలి అనే ఉద్దేశ్యంతో సత్సంకల్పాలు ఉంటాయి. అలా శిష్యుని యొక్క హితం, ఆరోగ్యం, ఆచారం, ఆనందం, ఆత్మపరిపూర్ణత కోసం ఎవరైతే కృషి చేస్తారో ఆయనే గురువు. గురువు శిష్యుని యొక్క హితం కోసం సతతం సిద్ధంగా ఉంటాడు. ఏదో ఒక పదినిమిషాలు శిష్యుని యొక్క హితం కోరుకోవటం కాదు సతతం శిష్యుని యొక్క హితం కోరుకునేవాడే గురువు. తల్లితండ్రులకు తమ పిల్లలపై ఎలాంటి ప్రేమ ఉంటుందో, పిల్లలతో పాటే వారిపై ప్రేమ తగ్గకుండా పెరుగుతూ ఉంటుందో అదేవిధంగా గురువుగారికి కూడా శిష్యుడు బాగుపడాలి అనే విషయంలో కటాక్షం ఎప్పుడూ ఉంటుంది.

**స్వర్ణలతగారు : తల్లితండ్రులు మొదటి గురువులు అన్నారు, మీ పూర్వాశ్రమంలో మీ గురించి చెబుతారా ?**

**స్వామివారు :** పరమాచార్యులవారి, జయేంద్రులవారి పరిచయం అనేది పూర్వాశ్రమ తల్లితండ్రుల ద్వారానే మాకు వచ్చింది. కొన్ని తరాల ముందు ఆంధ్రదేశంలో గోదావరీ తీరంలో ఉండేవారు. తరవాత తమిళనాడు ప్రక్కన సురుటుపల్లి వచ్చి అక్కడనుండి మూడు గ్రామాలకు వలస వచ్చారు. ఇక్కడ ఉండిపోయి వ్యవసాయం అదీ చేసేవారు. 'స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్' అని భగవద్గీతలో చెప్పినట్లుగా వారి స్వధర్మ అనుష్ఠాన ప్రకారం నిత్యం దేవతార్చన, వేద అధ్యయనం, శాస్త్ర ప్రచారం చేసేవారు. దాని వలన మనం స్వామివారి దగ్గరకు




రావటం, అలా పరిచయం ఏర్పడింది. సత్సంగం కారణం.

**స్వర్ణలతగారు : మీకు ఏ వయస్సులో ఈ అధ్యాత్మిక బీజం ఏర్పడింది ?**

**స్వామివారు :** ఆధ్యాత్మికమనేది ఇప్పుడు చిన్నవయస్సు నుండే చూస్తూ ఉంటాం. భాగవతం వినటం, పెద్దబాలశిక్ష చదవటం, డు,ము,వు,లు ప్రథమావిభక్తి అని సంస్కృతం చదవటం, అమరకోశం చదవటం, అలా హూణ విద్య (లౌకికమైన విద్య)తో పాటు మన ధర్మము, సంస్కృతి పట్ల ఆసక్తి వచ్చేటట్లుగా చుట్టూ పర్యావరణం కూడా ఒక కారణమౌతుంది. అంటే పెద్దవాళ్ళని చూడటం, గుడికి వెళ్ళటం, గుడిలో సేవ చేయటం, పుష్పార్చనకు సేవ చేయటం, అభిషేకాలకు సహకరించటం, అలా ఊరేగింపులు, నామ సంకీర్తనం, జాతరలు, వీధినాటకాలు చూడటం, గ్రామాలలో మహాభారతం వంటి కథలను నాటకం వేస్తారు. దాంట్లో కర్ణుడు, దుర్యోధనుడు, శకుని, భీష్మాచార్య వంటి పాత్రలను చూసినప్పుడు ఒక బలమైన అభిప్రాయం ఏర్పడుతుంది. అది ఏమిటంటే మన ధర్మమనేది రామాయణానికి, భారతానికి, భారతావనికి సంబంధించినదని నమ్మకం. అన్నదానాలు చేస్తే ధర్మము. మనం చూస్తున్న దృశ్యం కూడా మనస్సులో ఒక

ఆసక్తిని శ్రద్ధని, ప్రేరణని, ఉత్సాహాన్ని కలిగిస్తుంది. శృతి మరియు దర్శనమ్ ఎంతో బలమైన అభిప్రాయాలు ఏర్పరుస్తాయి. గ్రామానికి పెద్దవారు రావటం అంటే మహనీయులు, సన్యాసులు రావటం, వారిని సందర్శనం చేసుకోవటం, రామనామం వ్రాస్తే స్వామివారు ప్రసాదాలు ఇస్తారు అనేది చిన్నవయస్సులోనే బలంగా ప్రభావం చూపించింది. పర్యావరణం అనేది కూడా మనస్సులో బలమైన ప్రభావాన్ని చూపిస్తుంది. దానితో పాటు సేవాకార్యక్రమాలు కూడా ప్రభావాన్ని చూపించాయి. ఉదాహరణకు గ్రామాలలో పూవులు కోయటం, శివునికోసం తుమ్మిపూలు, బిల్వపత్రాలు కోయటం మొదలైన సత్సంగాలు చాలా ప్రభావాన్ని చూపాయి. అప్పుడు ఒకసారి శ్రీ జయేంద్ర సరస్వతీ స్వామివారు ప్రక్కన గ్రామానికి వచ్చారు. అప్పుడు అందరూ ఫలానా శంకరాచార్యులు ప్రక్కగ్రామానికి వచ్చి ఉన్నారు అని, మూడు గ్రామాలు చూసుకుంటూ మాఊరి వైపు వస్తున్నారు అని చెప్పుకున్నారు. చెరువుప్రక్కన గట్టుమీదగా చాలా వేగంగా నడుచుకుంటూ వస్తున్నారు. ఆ ఊరేగింపు కూడా చూశాము. అప్పుడు స్వామివారు వచ్చిన సందర్భంలో శంకరాచార్యులవారి పుస్తకాలు అన్నీ ఆయన ప్రక్కన పెట్టారు. సరే శంకరాచార్యులు ఎవరు? ఏమి? అని చూడటం, దాంట్లో కనకధారాస్తోత్రం గురించి ఫోటోలు చూడటం, వారు శ్రీశైలంలో తపస్సు చేసిన పెయింటింగ్ ఫోటోలు చూడటం, రామనామం రాస్తే విశేష ప్రసాదాలు మరియు అమ్మవారి రూపు (వెండిబిళ్ళ) లాంటివి ఇస్తారని చెప్పటం. ఆ విధంగా స్వామివారిని దగ్గర నుండి సేవించుకోవటం అలవాటయ్యింది. తరువాత మహాస్వామివారు మహారాష్ట్ర యాత్రలో ఉన్నారు. జయేంద్ర సరస్వతీ స్వామివారు కూడా అక్కడే ఉన్నారు. ఇద్దరూ కలిసి శంకరాచార్య





జయంతి ఉత్సవం చేశారు. అక్కడకు వెళ్ళి మేము వారిని సందర్శనము చేసుకోవటం జరిగింది. ఆ తరువాతి సంవత్సరం కర్ణాటకరాష్ట్రానికి వారు వచ్చారు. గుల్బర్గా దగ్గర బ్రహ్మపూర్ అనే ఊరు వద్దకు వెళ్ళి వారిని దర్శించుకోవటం జరిగింది. దానితోపాటు స్వాములవారితో మాట్లాడే అవకాశం దొరికింది. అప్పుడు స్వామివారి దగ్గరకు వెళ్ళాలి, చూడాలి, మాట్లాడాలి, వారి ఆశీర్వచనం తీసుకోవాలి అని అనిపించింది. ప్రతి సంవత్సరం వైశాఖమాసంలో మహాస్వామివారి దగ్గరకు వెళ్ళటం జరిగింది. ఆశ్వీయుజమాసం నవరాత్రి సందర్భంలో శ్రీ జయేంద్ర సరస్వతీ స్వామివారిని కలవటం జరిగింది. అలా పరిచయం జరిగింది. తరవాత వేదాధ్యయనం చేయటం జరిగింది.

**స్వర్ణలతగారు :** కంచిపీఠంలోనే వేదాధ్యయనం చేశారా ?

**స్వామివారు :** ఆ ! అక్కడే జరిగింది.

**స్వర్ణలతగారు :** మీరు ఏ వయస్సులో వేదాధ్యయనానికి కంచి వెళ్ళారు ?

**స్వామివారు :** తొమ్మిది పది సంవత్సరాల వయస్సులో వెళ్ళటం జరిగింది. దానికి ముందు ఆరు ఏడు సంవత్సరాల నుండే సంస్కృతం చదవటం అలవాటు. ఉపనయనం అయిన తరువాత వేదాధ్యయన మనేది ప్రారంభం చేశాము. తరువాత స్వామివారి దగ్గర పరీక్షలు ఇవ్వటం, వేదపరీక్ష అవన్నీ జరిగాయి. టి.టి.డిలో కూడా పరీక్ష రాశాము.

**స్వర్ణలతగారు : స్వామివారు మిమ్మల్ని ఏ వయస్సులో కంచిపీఠ గురువులుగా నిర్ణయించారు ?**

**స్వామివారు :** ఏమి నిర్ణయించారో వారు నిర్ణయించింది వారికే తెలుస్తుంది.

**స్వర్ణలతగారు : అవును. కానీ పైకి ఎనౌన్స్ చేసింది ఎప్పుడు ?**


**స్వామివారు :** 12, 13 వయస్సు ఉన్నప్పుడు మనకు తెలిసింది. అంటే చదువుకోమని చెప్పేవారు. ఈ చదువు అయిపోయిందా ? ఆ చదువు అయిపోయిందా అని జయేంద్రులవారు అడిగేవారు. తరవాత ఒక పదమూడు వయస్సు వచ్చినప్పుడు ఇలా నిర్ణయం తీసుకున్నారు. తీసుకొని మహాస్వామివారు ఉన్నచోటికి పంపించారు. వారి దగ్గరకు వెళ్ళి ఆశీర్వచనం తీసుకురమ్మని పంపించారు. అప్పుడు మహాస్వామి వారు ఏ ఊరు ? ఏమి సమాచారం ? అన్నీ అడిగారు, అంటే దానికి ముందే జయేంద్రులవారు మహాస్వామివారికి చెప్పినట్లుంది. మహాస్వామివారు ఆశీర్వదించారు. కంచిలో ఈ కార్యక్రమం 14 వయస్సు వచ్చినప్పుడు చేశారు.

**స్వర్ణలతగారు : మహాస్వామివారితో మీ అనుభవాలేమిటి ?**

**స్వామివారు :** ముందు నుంచే వారిని కలవాలి, దర్శనం చేసుకోవాలి, మాట్లాడాలి, ఆశీర్వచనం తీసుకోవాలి అనే తపన ఉండేది.


**స్వర్ణలతగారు : నడిచేదైవం కాబట్టి ఎవరికైనా ఆ తపన ఉంటుంది.**

**స్వామివారు :** అవును ! అలా సతారా, గుల్బర్గా, మహబూబ్‌నగర్ లలో చూసినాము. చూసినప్పుడు ఒకసారి స్వామివారు ఒక మంత్రం గురించి అడగటం జరిగింది. కంచిపీఠంలో దీపారాధన చేస్తున్నప్పుడు ఒక మంత్రం చదువుతారు. ఆ మంత్రం గురించి వారు అడగటం జరిగింది. దానికి తర్వాత మేము ఇక్కడికి రావటానికి సంబంధం తెలియదు. తరువాత 1983 సంవత్సరము వైశాఖమాసం ఇక్కడ కంచిలో ఆశ్రమం ఇచ్చిన తరువాత కొన్ని రోజులు కంచిలో ఉన్నాం. జయేంద్ర సరస్వతీ స్వామివారు ఒక గ్రామంలో వసతి ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉండండి అని చెప్పి వారు ఆంధ్రదేశం వెళ్ళిపోయినారు. అప్పుడు మహాస్వామివారు కర్నూలు దగ్గర ఉన్నారు. పాదయాత్రగా కర్ణాటక దగ్గర నుండి వస్తున్నారు. రాయచూర్ మొదలైనవి చూసుకొని డిచ్‌పల్లి ఆంజనేయస్వామి గుడివద్దకు చేరుకున్నారు. చాతుర్మాస్యం కోసరం కంచి నుండి కర్నూలు రమ్మనమని ఒకరోజు కబురు పంపించారు. కంచి నుండి డిచ్‌పల్లి రావటానికి ఒక పదహేనుమంది పెద్దవయస్సు కలిగిన అనుభవం, భక్తి ఉన్న వారిని మహాస్వామివారే సెలెక్ట్ చేసి పంపించారు. వారు పెద్దపెద్ద ఉద్యోగస్థులు, సేవకులు, సమాజసేవ చేసేవాళ్ళు. అందరం కలిసి అక్కడ నుండి బయల్దేరాము. రేణిగుంట వచ్చిన తరువాత ఆ కాలంలో వారు ఉపయోగించిన



పల్లకీ పంపించారు.

తరువాత కొంతదూరం నడవటం, కొంత దూరం పల్లకీలో ప్రయాణించాము. అలా మామండూరు, కోడూరు, రాజంపేట, కడప, మైదుకూరు, ఆళ్ళగడ్డ, చాకలిమర్రి, కార్లబుగ్గ, అవన్నీ చూసుకొని కర్నూలు వెళ్ళాము. కర్నూలులో త్రయోదశి రోజు ప్రదోషం పూజ నాడు వారి సందర్శనం చేసుకున్నాము. తర్వాత అక్కడే ఉండి చాత్రుర్మాస్యం చేశాము. అప్పుడు పాఠాలు చెప్పేవారు. సంస్కృతము, నీతిశాస్త్రము, బ్రహ్మసూత్రము వంటి శాస్త్రాలన్నీ నేర్పటం మొదలుపెట్టారు. అప్పుడు ఇంకా కొంచెం దగ్గరికి, వారి సన్నిధికి వెళ్ళటం జరిగింది. అక్కడి నుండి కంచి వెళ్ళటానికి ఆరుమాసాలు పట్టింది. అప్పుడు తిరుగుప్రయాణంలో పణ్యము, పులివెందుల, రాయచోటి, వేంపల్లి, వేముల, కొండాపురం, మేదంచర్ల వంటి ఎన్నో గ్రామాలు చూశాము. ప్రతీ గ్రామం చూసి అక్కడ ఉండే సభ్యత, సంస్కృతి, గ్రామీణ ప్రజల యొక్క భక్తిభావాలు, ఆచారాలు, అన్నీ



దగ్గర నుండీ చూసే అవకాశం కలిగింది. ఇవన్నీ చూసుకుంటూ మహాస్వామివారి యొక్క గురువుగారైన పరమగురు అధిష్ఠానాలు ఉన్న కలవై అనే ఊరికి వెళ్ళాము. అక్కడ నుండి తమిళ ఉగాదికి కంచికి వెళ్ళాము.

**స్వర్ణలతగారు: మీరు మహాస్వామివారిని నడిచేదేవుడు అంటారు కదా ! ఆయన సనాతన ధర్మానికి, హైందవ ధర్మానికి ఎక్కువ విలువ ఇచ్చారు. దానితోపాటు హైందవ ధర్మానికి చాలా ప్రణాళికలు వేశారు. ఆయన నుంచి మీరు హైందవ ధర్మం గురించి ఏమి నేర్చుకున్నారు?**

**స్వామివారు:** తర్కం, వేదాంతం, శాస్త్రం, సాహిత్యం, ఉపనిషత్తులు, మొదలైన శాస్త్రాలు అన్నీ ఆయనే నేర్పారు. తరువాత కళలు మ్యూజిక్, శిల్పశాస్త్రం, ఆయుర్వేదం, బుర్రకథ, అష్టావధానం నేర్చుకోవటం జరిగింది. రాయలసీమలో గవర్నమెంటు స్కూలులో అష్టావధానం ఏర్పాటు చేశారు. వీటితోపాటు మనదేశ చరిత్ర, సమాజ చరిత్ర, పేదరిక నిర్మూలన, అందరికీ సంతృప్తి కలిగించటం ఎలా ? ఎవరికీ ఆకలి లేకుండా, ఎవరికీ కష్టాలు లేకుండా సహాయ సహకారాలు అందించటం ఎలా ? ఈ దేశం యొక్క త్యాగ చరిత్ర ఏమిటి ? అంటే అది ఆధ్యాత్మికం కావొచ్చు, దేశ నిర్మాణం గురించి కావచ్చు, ఇలాంటి విషయాలన్నీ ఆయన నుండి నేర్చుకోవటం జరిగింది. శిలాలేఖనాలు గురించి కూడా నేర్పారు. రాయచోటిలో వీరభద్రేశ్వర స్వామివారి గుడిలో ఉన్నాము. వేలూరులో జలకంఠేశ్వరస్వామివారి గుడిలో ఉన్నాము. రాజులు, మహారాజులు సత్రాలు కట్టటం, గోశాలలు నిర్మించటం, వేద పాఠశాలలు కట్టటం లాంటి గొప్ప కార్యక్రమాలు ఆ శిలాశాసనాల మీద రాసి ఉంటాయి.

మహాస్వామివారు ఆ శిలాశాసనాలను మామూలు పుస్తకం చదివినట్టుగా గబగబా చదివేవారు. ఈ విద్యకు 'ఉట్టంకిత విద్యారణ్య' ట్రస్ట్ అని పెట్టారు. ఈ దేశం బి.సి మరియు ఎ.డి చరిత్రను ప్రజలు తెలుసుకోవాలని ఆ ట్రస్ట్‌ని స్థాపించారు. మహాస్వామివారికి విజ్ఞానం పట్ల ఆసక్తి ఉంది. దేశం యొక్క సమాజస్థితి బాగుండాలి, అందరూ ఆరోగ్యంగా, సుభిక్షంగా ఉండాలని కోరిక ఉండేది. అందరూ మంచిగా చదువుకోవాలని, కుటుంబ సభ్యత ఉండాలని, అందరూ భక్తిమార్గంలో ఉండాలనీ పెద్దలపట్ల గౌరవమర్యాదలు పాటించాలనీ అలా మొత్తం పుస్తకాలలో ఏమున్నాయో అన్నీ ఆచరించి చూపించేవారు. మనం కూడా ఆచరించాలని కోరుకునేవారు. పుస్తకాలలో ఉండే వాటిని ఆచరణలోనికి తేవాలని వారు చేసిన ప్రయత్నం ప్రచారం అనితరసాధ్యం.

**స్వర్ణలతగారు : ఆయన నడిచేదైవం, కామాక్షీ పరదేవతే ఆయన**

**అని అంటారు.**

**స్వామివారు :** అవును, అవును. ఆయనది అంతటి కారుణ్యం.

**స్వర్ణలతగారు : ఆయన భారతదేశమంతా కాలినడకన నడిచారు కదా ! అంత తిరిగిన ఆయనతో ఆ కాలినడకన మీరు కూడా ఆయనతో తిరిగారా ?**

**స్వామివారు :** ఆ తిరిగాం కదా !

**స్వర్ణలతగారు : అప్పుడు మీకు ఆయనతో గడిపిన ఒక మధురక్షణం ఏమైనా ఉందా స్వామి. మీ పర్సనల్‌గా మీకు కలిగిన అనుభవం ఏమైనా ఉందా ?**

**స్వామివారు :** ఒక్క మధురక్షణం కాదు మధురక్షణాలు ఉన్నాయి.

**స్వర్ణలతగారు : ఆయనలో మీరు కామాక్షీ పరదేవతను చూశారు కదా, అందుకని అడుగుతున్నాము.**

**స్వామివారు :** 'ఆ వీక్షణం అనేది అక్షయం' ఆ కారుణ్యం అనేది చాలా గొప్పది. ఎంతో గొప్ప జ్ఞాపకశక్తి వారిది. 50, 60 సంవత్సరాల క్రితం జరిగిన దానిని కూడా చూసినది చూసినట్టుగా చెప్తారు. అది ఒక అద్భుతం. ఎవరు చేసిన మంచి పనినీ మర్చిపోరు. ఎంత చిన్న సేవ చేసినవారినైనా గుర్తుపెట్టుకుంటారు. ఆవులకు కాస్త గడ్డి పెట్టినవారిని కూడా వారు మర్చిపోరు. ఫలానావారు ఒకరికి భోజనం పెట్టారు. అది ఒకరికి పెట్టినా అది ఎంత చిన్న విషయమైనా కూడా వారి మనవడు వచ్చినప్పుడు ఇలా మీ తాతగారు ఫలానా వారికి భోజనం పెట్టారని చెప్పి సంతోషపడతారు. చేసిన ప్రతి చిన్నపనిని, సేవని చాలా గొప్పగా భావిస్తారు. అప్రిసియేషన్ చేస్తారు. ఆయన స్థాయికి అలా చేయవలసిన అవసరం లేదు. వారి గొప్పతనం అది.

**స్వర్ణలతగారు : పర్సనల్‌గా మీకు ఉన్న అనుభవం గురించి చెప్పండి?**

**స్వామివారు :** చిన్నవయస్సులో ఉన్నప్పుడు ఏదైనా జ్వరం గాని అస్వస్థతగాని ఉన్నదనుకోండి మనము ఉన్న చోటికే వారు వచ్చి చూసేవారు. అదీ ...

**స్వర్ణలతగారు : తల్లి కారుణ్యం !**

**స్వామివారు :** ఆ... , తరువాత భాష్యపాఠం చెప్పేవారు. ఒకరోజు తొమ్మిది గంటలకు, ఒకరోజు పన్నెండు గంటలకు, ఒకరోజు రెండు గంటలకి చెప్పేవారు. అప్పుడు ఒకసారి మేము వెళ్ళి కొంచెం దూరంగా



ఉన్నాము. ఒక శిష్యుడి దగ్గర ఇలా చెప్తున్నారు, “మేము బాలస్వామికి ఒక్కొక్కరోజు ఒక్కో సమయంలో ఎందుకు చెప్తున్నామంటే ఆయనకు ఇలా అలవాటు అవ్వాలని” అని. మహాస్వామివారు చేసే ఏ పనిలోనైనా ఒక పరమార్థం ఉంటుంది. ఒక కారణం ఉంటుంది. చాలా నిష్ఠలో ఉండేవారు. చాలా పెద్ద వయస్సు వచ్చిన తరువాత మేము ఒకసారి వెళ్ళి ఉదయం ఏదైనా ఫలహారం తీసుకుంటారా అని అడిగాము. ఆయన “చిన్నప్పటి నుండి స్నానం చెయ్యకుండా ఏమీ తీసుకోము, అలా అలవాటు అయ్యింది, ఇప్పుడు ఆ అలవాటు మార్చము” అన్నారు. అంటే మహాస్వామివారికి సంకల్పాలు, నిష్ఠ ఎక్కువ, కారుణ్యం మరీ ఎక్కువ. ఆయన అందరికీ మంచి జరగాలని ప్రార్థన చేస్తారు, ప్రయత్నమూ చేస్తారు.

**స్వర్ణలతగారు: మీ గురించి మహాస్వామివారు ఏమని చెప్పేవారు? అందరితో !**

**స్వామివారు :** అంటే అది అంతా వారి దయ.

**స్వర్ణలతగారు : కానీ నేను విన్నదేమిటంటే మీ మహాత్మ్యం 50 సంవత్సరముల వయస్సు తరువాత బయటపడుతుందని చెప్పేవారట, మీ మహాత్మ్యం గురించి అందరూ కొనియాడతారు అని అనేవారని నేను విన్నాను.**

**స్వామివారు :** ఏమి సంబంధమో మనకు తెలియదు కానీ, ఆయన చూపించిన ప్రేమ, దయ, అపారం. దానికి ప్రతిగా మనం చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి.

**స్వర్ణలతగారు : ఆయనే తల్లీ, తండ్రీ గురువై మిమ్మల్ని నడిపించారు.**

**స్వామివారు :** ఆ ! అదే ! అవును. అన్నివిధాల వారి యొక్క ఆశీర్వచనం, ఉపదేశాలు, తీర్చిదిద్దాయి. దర్శనమ్ అనేది మార్గదర్శనం అనాలి. మన సంకల్పాలు మంచిగా ఉండటానికి, ధృడంగా ఉండాటానికి చాలా స్ఫూర్తిదాయకంగా ఆయన దర్శనం ఉంటుంది.

**స్వర్ణలతగారు : ఆయన సహస్రచంద్రదర్శనం అప్పుడు మీరు, జయేంద్ర సరస్వతీస్వామివారు బంగారు కాసులతో అభిషేకం చేశారు. అప్పుడు మీ అనుభూతి ఏమిటి ?**

**స్వామివారు :** ద్రవ్యంలో గొప్పది స్వర్ణం. స్వామివారు వ్యక్తిత్వంలో గొప్పవారు. అంటే అమ్మవారికి ‘హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణరజతస్రజాం’ అన్నట్లు సాక్షాత్తూ కామాక్షీ స్వరూపం వారు. అందువల్ల బంగారంతో అభిషేకం చేసే ఆలోచన అవకాశం వచ్చింది. శతాబ్ది పూర్ణ ఆయుష్మ సందర్భంలో మనకు ఇంత మంచి అవకాశం వచ్చినందుకు, ప్రజల తరఫున జరిగిన ఈ మంచి కార్యక్రమంలో మాకు కూడా మనస్సులో అత్యుత్సాహం కలిగింది.

**స్వర్ణలతగారు : జయేంద్ర సరస్వతీస్వామివారి గురించి చెప్తారా?**


**స్వామివారు :** శాస్త్రాన్ని మనం రెండుగా విభజించి చూస్తే, శాస్త్ర



పరిరక్షణము పెద్దస్వామివారు, సమాజ పరిరక్షణము జయేంద్ర సరస్వతీస్వామివారు. అంటే మనిషి సోమరిగా కూర్చోకూడదు, భయపడకూడదు,

పనిచెయ్యకుండా వ్యర్థం చెయ్యకూడదు. సమయాన్ని, ఉండే సౌకర్యాలని సమకూర్చి పని చెయ్యాలి. ఒకరి దగ్గర డబ్బు, ఒకరి దగ్గర అధికారం, ఒకరి దగ్గర స్థలం ఉంటాయి. అందరినీ కలుపుకుని ద్రవ్యాన్ని సమకూర్చి ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరిస్తూ దేశ ప్రగతి కోసం పనిచెయ్యాలి. ప్రభుత్వాలు పనిచేస్తున్నా విద్యా వైద్యంలాంటి రంగాలలో ప్రజలకు కూడా కర్తవ్యం, బాధ్యత ఉన్నది. ప్రజలకు అవకాశం కూడా ఉంది. లీడర్‌షిప్ నేతృత్వం అనే దాంట్లో గ్రామీణ క్షేత్రాలలో రాయితో కట్టిన గుళ్ళు అన్నీ శిథిల అవస్థలో ఉంటే అవన్నీ చూసి శిల్పులు, దాతలను సమకూర్చి, ప్రభుత్వంతో కూడా కలిసి మాట్లాడి అందరినీ కలుపుకుని వెళ్ళాలి. 'సంఘే శక్తిః కలౌ యుగే' అని అన్నారు కదా! **మహాస్వామివారు 'ధర్మ' స్వరూపం. జయేంద్రస్వామివారు 'దాన' స్వరూపం.** మహాస్వామివారు ప్రాణాయామము, ధ్యానము, మౌనము, ఆహారము, నియమాలతో 'రామో విగ్రహవాన్ ధర్మః' అనేది ఆచరించి చూపారు. జయేంద్రస్వామి వారు వికలాంగులకి, పేదవారికి సహకరించాలి, ఉద్యోగ ఉపాధులు ఏర్పాటు చెయ్యాలి, అప్పులు అందించాలి, అందరూ పైకిరావటానికి సహాయపడాలి, భగవంతుని నమ్ముకోవాలి, స్వధర్మాన్ని, మన కృషిని, ప్రయత్నాన్ని మనం నమ్మాలి. ఎప్పుడూ పని చేస్తుండాలి అనేది జయేంద్రులవారి అభిమతం. పరమా చార్యులవారు 'ధర్మాసక్తి' కోసం పనిచేశారు. జయేంద్రస్వామివారు 'ప్రజాహితం' కోసం పనిచేశారు. ఇద్దరూ ఒకే ధర్మమే ఆచరిస్తూ, అనుసరిస్తూ ఉన్నా వారు ధర్మాసక్తికి వీరు ప్రజాహితానికి ప్రాధాన్యత ఇచ్చారు. ఇరువురూ ఒకే ధర్మాన్ని లక్ష్యంగా పెట్టుకుని చేశారు.

మహాస్వామివారు విత్తనాలను ముఖ్యంగా తీసుకున్నారు. జయేంద్రులవారు ఆకులు, కాండము, కొమ్మలు ముఖ్యంగా తీసుకున్నారు. ఇరువురూ ప్రజలని నమ్మకంతో ఉండండి అని ప్రోత్సహించారు. సీతమ్మవారు 'ఏతి జీవంతమానందః నరం వర్ష శతాదపి' అని అన్నారు. ఆత్మవిశ్వాసం ఉండాలి. వ్యక్తిగతం కావచ్చు, గ్రామాభివృద్ధి కావచ్చు, దేశహితం కోసం కావచ్చు. ప్రాక్టికల్‌గా కూడా చూసుకోవాలి. మనకి స్వధర్మమనేది ఉన్నా మనం లోకంతో పనిచేస్తున్నప్పుడు కొంత యదార్థం తెలుసుకోవాలి. పరమాచార్యుల వారు పరమార్థం తెలుసుకొని యదార్థం తెలుసుకుందాం అనే శైలి. జయేంద్రులవారిది యదార్థం తెలుసుకుని పరమార్థం తెలుసుకుందాం



అనే శైలి.

**స్వర్ణలతగారు :** **పరమాత్మను నమ్ముకుని ఉన్నాం కాబట్టి అన్నీ ఆయనే చూసుకుంటారని పరమాచార్యుల నమ్మకం. సమాజంలో బ్రతుకుతున్నాం కాబట్టి సమాజంలో బ్రతికే విధానాన్ని బట్టి పరమాత్మని చూద్దాం అని జయేంద్రులవారు.**

**స్వామివారు :** అదే! 'శరీరం' గురించి జయేంద్రులవారు, 'శారీరం' గురించి పెద్దస్వామివారు. 'భుక్తి–ముక్తి', ప్రత్యక్షముగా మనకు అవసరము. శాస్త్రము అత్యవసరము. అలా ఈ రెండూ దగ్గర నుండీ చూసే అవకాశన్ని భగవంతుడు మనకు కల్పించాడు. భజన బృందాలకు మద్దెల, తాళాలు ఇవ్వటం, అలహాబాద్, ప్రయాగలలో ఉండే పడవలు నడిపే వారికి పోటీలు నిర్వహించి పంచెలు బనియన్లు ఇవ్వటం జయేంద్రులవారు చేశారు. శిల్పులకు, సన్నాయివాళ్ళకు వృత్తి కల్పించి భుక్తికి లోటు లేకుండా ప్రయత్నించారు. ఆవిధంగా సమాజంలో ఉండే వాళ్ళందరికీ కూడా వృత్తికల్పనకు ప్రయత్నించారు. అందరూ కూడా పెద్ద తపస్సులు చేయటం కష్టం. అందుకని అందరూ రామనామం రాయండి, శివనామం జపించండి, దీపం వెలిగించండి, ఆడవారు ఒక 50మంది కలిసి ఒకచోట దీపపూజ చేయండి, అన్నదానం చేయండి, టైలరింగ్ నేర్చుకోండి. టైలరింగ్ చేస్తూ రామనామం చేసుకోండి. అలా భుక్తితో పాటు అందరికీ ధర్మం పట్ల ఆసక్తిని పెంచేందుకు జయేంద్రులవారు చేసిన ప్రయత్నం, కృషి మనస్సుకు చాలా సంతోషాన్ని కలిగిస్తుంది.




**స్వర్ణలతగారు : ఎవరి దగ్గర మీరు తండ్రి భావంతో ఉన్నారు ? మీరు ఎవరి యందు గురుభావంతో ఉన్నారు?**

**స్వామివారు :** సంకల్పాలు పరమాచార్యులవారి దగ్గర నుండి నేర్చుకున్నాము, ప్రకల్పాలు జయేంద్రులవారి నుండి నేర్చుకున్నాము. అంతేకాని వారి ఇరువురిలో భేదం లేదు. ఆశ్చర్యమైన అనుభవాలు దొరికినాయి. పెద్దవారి నుండి వంద సంవత్సరాల అనుభవము, చిన్నవారి నుండి 50 సంవత్సరాల అనుభవం తెలుసుకున్నాము. వ్యక్తి ముఖ్యం. సమాజం ముఖ్యం. ఈ రెండిటి కన్నా మన కర్తవ్యం ముఖ్యమైనది అనే విషయాన్ని వారిరువురి దగ్గర నుండి నేర్చుకున్నాము. అంటే డ్యూటీ ముఖ్యం. అవకాశాలని సవ్యంగా వాడుకొని మనం మంచి సమాజం కోసం పనిచేయాలి. భారతదేశమనేది అనేక భాషలు, ఆర్థిక వ్యవస్థలు, సౌకర్యాలు, అసౌకర్యాలు ఉండే దేశం. ఇలాంటి దేశంలో సౌమ్యమైన, సాత్వికమైన మనస్సు ముఖ్యం. అందరు గొప్పవాళ్ళు, మనకు సన్నిహితులే. అందరికీ మంచి జరగాలని కోరుకోవాలి. మన స్వధర్మం మనకి గొప్పది కాని, మనం అందరినీ గౌరవించాలి. అందరినీ దగ్గరికి తీసుకొని విశాల దృక్పథంతో పనిచేయాలనే విషయం ముఖ్యం. మేము గ్రామీణక్షేత్రాలు, పట్టణాలు వెళ్ళాము. చిన్నవయస్సులో రాయలసీమలో తిరిగాము. అప్పట్లో రాయలసీమలో నీళ్ళ ఇబ్బంది ఉండేది. అనేక సౌకర్యాలు, అసౌకర్యాలు ఆ చిన్నవయస్సులోనే చూశాము. గ్రామాలలో నడుస్తూ ఉంటే అక్కడి ప్రజలు అందరూ కుతూహలంగా చూసేవారు. అక్కడక్కడ గవర్నమెంటు బడులలో వారిని కలుసుకొనేవారము. అప్పుడు చిన్నస్వామి ఎవరో వచ్చారని అక్కడివారు మమ్మల్ని వింతగా, సంతోషంగా, ఆశ్చర్యంగా చూసేవారు. అక్కడ ప్రజల యొక్క కష్టనష్టాలు చూసినప్పుడు మన శక్తి సామర్థ్యాలను ప్రజల కొరకు ఎలా వినియోగించాలి అనే జ్ఞానాన్ని ఇద్దరు స్వాములు దగ్గర నేర్చుకున్నాము.

**స్వర్ణలతగారు : స్వామి ఎన్నో విషయాలు చక్కగా విపులీకరించి ఎంతో సహృదయంతో మాకోసం మీ కాలాన్ని వెచ్చించారు. స్వామి మీకు చాలా చాలా ధన్యవాదాలు.** *

# 1936లో పరమాచార్యులవారి ఆంధ్రదేశ విజయయాత్ర

**1936 ధాతునామ సంవత్సరమున శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యులు మూలామ్నాయ సర్వజ్ఞ పీఠ శ్రీ కంచికామకోటి పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామివారు విజయయాత్రలో భాగంగా విజయనగరం వేంచేసినప్పుడు విజయనగర సంస్థానాధీశులు, పురప్రజలు విశేషంగా స్పందించి మహాస్వామివారికి సమర్పించిన స్వాగతపత్రములతో కూడిన విజయ యాత్రా విశేషములు పొందుపరచిన అరుదైన పుస్తక సంగ్రహము పాఠకుల కొరకు.**



ఓం

శ్రీకాంచీకామకోటిపీఠాధీశ

జగద్గురు శ్రీ ౧౦౦౮ శంకరభగవత్పాద-విజయనగర-

విజయ యాత్రా సంగ్రహము.

Vijayanagara Vijaya Yathra Sangrah
of Sri Kanchi Komakoti Peethadhiswara
(Sankaracharya)

1935 and 1936


by
D. B. V. Subrahmanya Sastri.



శ్రీమదాద్య శంకరభగవత్పాదులు

శ్రీకాంచీకామకోటిపీఠమందలి కామాక్షీ వేద్యాలయమందు, శ్రీఆది శంకరాచార్యులువారి అధిష్ఠానసిద్ధిస్థానమందు, స్థాపింపబడిన, శిష్య సమేత శ్రీశంకరభగవత్పాదుల పురుషాకృతిసమాన విగ్రహము.

విజయనగర విజయయాత్రి



శ్రీకాంచీకామకోటి పీఠాధీశ పాత్రితస్మరణీయ-
శ్రీ ౧౦౦౮ శ్రీమహాదేవేంద్ర సరస్వతీసంయమీంద్రాః

విజయనగర విజయయాత్రి



శ్రీకాఞ్చీకామకోటిపీఠాధీశ పాత్రితస్మరణీయ
శ్రీ ౧౦౦౮ శ్రీచంద్రశేఖరేన్ద్ర సరస్వతీసంయమీంద్రాః

పరిశిష్టము 1.

ఓమ్.

శ్రీచన్ద్రమౌళీశ్వరో విజయతే.

శ్రీ ౧౦౦౮ జగద్గురు శ్రీకాఞ్చీకామకోటి పీఠాధిష్ఠాన

శ్రీమచ్ఛఙ్కరభగవత్పాదానాం

## శ్రీచన్ద్రశేఖరేన్ద్రసరస్వతీ శ్రీచరణానాం స్వాగతపత్రికా.

శ్రీమదాచార్యచరణాః !

అపి స్వాగతం శ్రీచరణానాం శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య వర్యాణాం, శ్రీశివరహస్యాదిప్రమాణసిద్ధ శ్రీమదాద్యశఙ్కరాచార్యసిద్ధిస్థానశ్రీకాఞ్చీకామకోటిపీఠమలఙ్కుర్వాణానాం, నిరతిశయ తపశ్చర్యా పవిత్రీకృత భారతవర్షాణామనుష్ఠానతోఽపి స్వవశంవదీకృత సాంఖ్యయోగాద్వైతాది దర్శనతత్త్వానా మాద్యశఙ్కర భగవత్పాదీయ దశవిభాగాన్తర్గతేన సురేశ్వరాపరపర్యాయేన్ద్రపద ఘటితేనేన్ద్ర సరస్వతీసమాఖ్యేన యోగపట్టేన "బ్రహ్మతా ముపదిదేశ చతుర్భిర్వేదశేఖర వచోభి రముష్మై" ఇతి శ్రీమాధవీయశఙ్కరవిజయత శ్చతావ్రపి మహావాక్యా న్యనుసన్ధేయానీతి నియమావలమ్బినం సురేశ్వరాచార్యప్రవర్తితం సరస్వతీసంప్రదాయ మలఙ్కుర్వాణానాం చ జగద్గురు శ్రీమచ్చన్ద్రశేఖరేన్ద్రసరస్వతీ పదాఙ్కిత శ్రీమచ్ఛఙ్కర భగవత్పాదానామ్.

ఓమ్

శ్రీశంకరో జగద్గురు ర్విజయతే తరామ్

కాంచీ కామకోటి పీఠాధీశ-జగద్గురు

## శ్రీ ౧౦౦౮ శంకరభగవత్పాద విజయనగర విజయయాత్రి.

ధాతృసంవత్సరము (1936.)

—0—

శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య శ్రీమచ్ఛంకర భగవత్పాద ప్రతిష్ఠిత శ్రీకామకోటి పీఠాధీశ్వర శ్రీమచ్చంద్రశేఖరేంద్రసరస్వతీ సంయమీంద్రులు గంగాది తీర్థ విజయ యాత్రలం గావించుచుఁ జాతుర్మాస్య దీక్షాంతమున బ్రహ్మపురి (బరంపురము నుండి ప్రస్థానమొనర్చి మార్గమధ్యమున ధాతృనామ సంవత్సర నిజ భాద్రపద బహుళ 30 గురువారము (15-10-1936 తేదీ) గోధూళికా శుభముహూర్తము నందు విజయనగరమునకు విజయముచేయుసమయమున, నగరవాస్తవ్యులును, నాహ్వానసంఘము వారును * సంస్థాన ప్రతినిధులును జలసంచయస్థానము (రిజర్వాయరు) దగ్గఱ శ్రీ జగద్గురువులకు మంగళ

* శ్రీ చరణులు బ్రహ్మపురి నుండు నవసరమున విజయనగర వాస్తవ్యులు శ్రీవారి నాహ్వానించుటకై 4-6-36 తేదీని సభ నొనర్చి యందు బ్రహ్మశ్రీ ఏమూరి నరసింహామువంతులుగారు యధ్యక్షత నాహ్వానసంఘము నేర్పరుప, నాహ్వానసంఘమువారు 22-9-36 తేదీని

(14)

పూజ్యపాదాః !

శ్రీమన్తో హి పఞ్చాననస్య శ్రీ విశ్వనాథస్యోర్ధ్వముఖా పరస్వరూప పరబ్రహ్మోపనిషత్ప్రతిపాద్యోర్ధ్వామ్నాయరూపం శ్రీ కాఞ్చీనగరస్థం కామకోటిపీఠ మధితిష్ఠన్తో మహర్షీణాం తీర్థయాత్రాక్రమ మేవాఽనాది సంప్రదాయసిద్ధ మాదర్శరూప మద్యాపి స్వార్థంశకటాదివాహనపరిత్యాగేన పరిపాలయన్తస్సతత మేవ సనుష్ఠానరఙ్గా మన్దస్మితపూరిత దిగన్తరాశ్చ సాంప్రతమపి భారతవర్షం మహర్షీణాం స్థానమితి సిద్ధాన్తం స్వీయేనాదర్శ చరితేన స్మారయన్తి.

గురువరేణ్యాః !

పఞ్చాశద్వత్సరేభ్యః పూర్వం శ్రీమత్పరమేష్ఠిగురూణా మివ శ్రీచరణానా మప్యత్ర విద్యానగరే విజయనగరాఖ్యయా సుప్రసిద్ధే యథాసంస్థాన మర్యాదం పురస్కృతయా చిరాకాఙ్క్షితయా విజయయాత్రయా కాష్ఠమౌనాది తపశ్చర్యానుష్ఠాన పూర్వక నవరాత్రోత్సవానుష్ఠానేన ఋగ్వేదహోమ శ్రీవిద్యాహోమ మహాపురుషసూక్తహోమ సాఙ్గత్రయీపారాయణాది బహుతరవ్రతకలాపసధ్రీచీనేన పరమపావన శ్రీజగదమ్బా శ్రీచన్ద్రమౌళీశ్వరపూజాది దర్శనేన సాధూపదేశా

(15)

మృతపానేన చైతన్నగరస్థ వేదవిజ్ఞానవర్ధనీపరిషదియం సనాతన ధర్మైకప్రవణా భగవతి శ్రీమదాచార్య చరణేషు భాగవతేషు చ నిరతిశయభక్తిసంపన్నా పరోపకారధురన్ధరా శ్రీమత్పరిపోష్యసనాతనధర్మసభా స్వీకృతమాచ శ్రీచరణానామనుగ్రహేణ యది స్యాత్తదేవేదమస్మాక మేతత్పరిషదన్తరఙ్గసదస్యానాం పరమం సౌభాగ్యం; తదేవ చ చిరాభిలషితం సుకృతమితి నాత్ర కోఽప్యతిశయోక్తి లేశోఽపి

అన్తే పునరిదం నివేద్యతే - యత్,

శ్లో॥ శ్రీకాఞ్చీమఠరాజపీఠకలితా న్యాసాష్టాఙ్గయోగా
న్వితా,
న్విద్యామూర్తి ముపేత్య సర్వజగతే బోధా
మృతం యచ్ఛతః ।
దుస్సాధైకతపఃక్రియావిలసితా నానన్దరూపా న్సదా,
శ్రీమచ్ఛఙ్కరచన్ద్రశేఖరయతీ న్వన్దామహే
సాదరమ్ ॥

(16)

ఇతి

శ్రీ విద్యానగర (విజయనగర) సంస్థానస్థిత వేదవిజ్ఞానవర్ధనీసభా ప్రతినిధయః.

విజయనగరే,
శ్రీశాలివాహన
శకాబ్దే ౧౮౫౮ తమే
ధాతృనామసంవత్సరే
ఆశ్వినశుక్లైకాదశ్యాం
సోమవాసరేసమర్పితా,
26-10-1936.

1 మూలరామప్రియ, కానుకుర్తి వేంకటకృష్ణరాయః, మాధ్వప్రభుః
2 ఆకెల్ల సత్యనారాయణః,
3 మహామహోపాధ్యాయ, తాతా సుబ్బారాయశాస్త్రీ,
4 మహామహోపాధ్యాయ, నౌడూరి వేంకటశాస్త్రీ,
5 న్యాయరత్న, పేరి లక్ష్మీనారాయణశాస్త్రీ,
6 శ్రీమతో(ఉ)యిలకందాడై వేంకట రామాచార్యః.
రామానుజీయః

(18)

వాద్య పూర్ణకుంభపురస్సరముగస్వాగతమిడి, పాలకీ నధివసించిన శ్రీసంయమీంద్రులను ముందిడుకొని యుత్సవముతోఁ బురవీధుల నుండి వచ్చి, డాక్టరు గాడె రామయ్యంగారి గృహమున శ్రీచరణములను నిల్పిరి.

శ్రీ భగవత్పాదులు దృఢమౌనమును బాలించుచు, శారద నవరాత్రములందు స్వయముగ శ్రీచంద్రమౌళీశ్వర త్రిపురసుందర్యర్చనలను సర్వకాలములం గావించుచు, ఋగ్వేద హోమ శ్రీవిద్యాహోమ మహాపురుషసూక్తహోమములను, ననేక జపపారాయణాదులను నొనరించిరి. శ్రీ ఆచార్యచరణులొనర్చు యర్చనవిధానాద్యనుష్ఠానము లెంతయు వైదికమత తత్త్వమును స్మరింపఁ జేసెను మహానవమినాడు (ది 24-10-1936 శనివారము) యథావిధిగ యజ్ఞపూర్ణాహుతుల నొనర్చి మహానవమీపూజను గావించిరి విజయదశమినాడు (25-10-36 ఆదివారము) శ్రీపూజ్యపాదులు శ్రీసరస్వతీపూజాపరిసమాప్తిని విద్యోత్కప్రమణ మొనర్చి, స్వమౌనదీక్షావసానమున శిష్యులకు బ్రహ్మపదోపదేశము గావించుట యాదిశంకరపద్ధ

శ్రీ ఆచార్యచరణులకు యథావిహితముగ స్వాగతోపచారములను నిర్వహింపఁ దీర్మానించి, 11-10-36 తేదీని శ్రీకాకులముమకాములో శ్రీ పీఠాధీశులను శారదనవరాత్రి మహోత్సవదీక్షలు విజయనగరమున జరుప నను గ్రహింపఁ బ్రార్థించిరి. శ్రీ జగద్గురువులును 8-10-36 తేదీని నగరవాసులకును, 10-10-36 తేదీని శ్రీవిజయనగరసంస్థానాధీశులమాతృపాదులకును బ్రత్యేకముగ మంత్రాక్షత ప్రసాదపూర్వకముగ శ్రీముఖములనుఁ బంపి తమ విజయము చేయుట నెఱుకపఱచిరి.

(19)

తిని బోలియుండెను. ఆనాఁటి సాయాహ్నమునఁ బండితమహాసభఁ గావించి, యందు శ్రీజగదాచార్యచరణులు శ్రీమహామహోపాధ్యాయ తాతా సుబ్బరాయశాస్త్రిగారిని 'శాస్త్రరత్నాకర'' అను బిరుదమున సమ్మానించిరి. మఱియు నెల్లఁ బండితులను యోగ్యమగు విధమున సమ్మానపాత్రులం జేసిరి పిమ్మట విజయముహూర్తమైన నగరస్థదేవాలయ సందర్శనము గావింప శ్రీవారు విజయయాత్ర యొనర్చిరి

ఏకాదశినాఁడు (26–10–36 సోమవారము) వేదవిజ్ఞానవర్ధనీపరిషత్ సంఘమువారు మహాసభను శ్రీజగద్గురువులకు స్వాగతపత్రమును సమర్పించిరి. (పరిశిష్టము 1.) ఆమహాసభయందు శ్రీచరణులు "స్వస్తిప్రజాభ్యః పరిపాలయంతాం న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః। గోబ్రాహ్మణేభ్య శ్శుభమస్తు నిత్యం లోకా స్సమస్తా స్సుఖినో భవంతు'' అను శ్లోకమునకుఁ బ్రవచన మొనర్చి, యనాదిసిద్ధమగు వైదికమతమును సర్వమతసామరస్యముగ నుపదేశించిరి (పరిశిష్టము 2)

మఱునటి దినమగు ద్వాదశీ మంగళవారమున (27–10–36) శ్రీసర్కారువారు సంప్రార్థించుటఁ జేసి సాయాహ్నమున శ్రీశంకర భగవత్పాదులు కోటకు విజయము చేసిరి. అచట శ్రీవిజయనగర సంస్థానాధీశుల మాతృపాదులు శ్రీభగవత్పాదపాదుకా సమభ్యర్చనము లొనర్చిరి. శ్రీమహారాజ కుటుంబము శ్రీపరమశివావతార శ్రీశంకర భగవత్పాద సందర్శన భాగ్యమునఁ దన్మయత్వము జెంది ధన్యమయ్యెను. ఈశ్వర

(20)

వ్యాహృతి శుభాశీస్సుల నంది శ్రీవిజయనగర సంస్థానాధీశ్వరులు ధన్యులైరి. శ్రీచరణుల పాదధూళిని గోటయు పవిత్రమయ్యెను.

త్రయోదశినాఁడు (28–10–36 బుధవారము) భక్తుల ననుగ్రహించి, ప్రదోషసమయమున శ్రీపీఠాధీశులు గావించిన శివార్చనము ప్రదోషసమయమునఁ బరమశివుని తాండవమువాఁ గననయ్యెను.

పూర్ణిమనాఁడు (29–10–36 గురువారము) శ్రీవారస్నాభిషేకాది విశేషవిధులచే శ్రీచంద్రమౌళీశ్వరుల కర్చన మొనర్చిరి

శుక్రవారమున (30–10–36) మఠభిక్షఁ గావించి, శ్రీపూజ్యపాదులు సంస్థానప్రజలకు భోజనప్రసాదముల ననుగ్రహించిరి. సాయంసమయమున శ్రీభగవత్పాదు లాంగ్లకళాశాల యందు మతమునుగూర్చి మంజుభాషణముల నుపన్యసించుచు (పరిశిష్టము 3), "త మేవం విద్వా నమృత ఇహ భవతి'' "అంతకాలే చ మామేవ స్మర న్ముక్త్వా కళేబరమ్। యః ప్రయాతి స మద్భావం యాతి నా స్త్యత్ర సంశయః'' అను విషయములఁ దేటఁబఱచి, "భగవద్ధ్యానము నభ్యాసయుక్తముగ నొనర్చి, మనోనిశ్చలత నంది, దాన దుఃఖ నివృత్తి యొనర్చుకొని, జ్ఞానులును, ముక్తులును నగుటకు యత్నింపుడు. మతనియమములను, శిష్టాచార సంప్రదాయములను గ్రహింపక యాచరింపుడు'' అని యెల్ల విద్యార్థులకును సదుపదేశముల నొనర్చిరి

(21)

ఆశ్వయుజ బ ౧ శనివారమున (31–10–36) శ్రీపీఠసన్నిధిని స్త్రీలకు సదుపదేశములను (పరిశిష్టము 4) గావించి పిమ్మట శ్రీచరణులు పండితగోష్ఠిని శాస్త్రార్థముల నొనర్చి, మఱియు నద్వైతమును గూర్చి లలితముగను, సామరస్యముగను నిట్లు బోధించిరి. "ఆదిశంకర భగవత్పాదులు సకలమలగు మతములను ఖండించి యాసేతుహిమాచల పర్యంతమద్వైతమతమును స్థాపించిన నాఁటినుండియు నీవఱకట్టి వైదికమత మొక్కటియు స్థాపింపఁబడలేదు ఎన్నియో మతము లెన్నియో స్థలములందుఁ బుట్టుచున్నను భారత పుణ్యభూమియం దంతట నద్వైతము స్థిరముగ నున్నది ఆదిశంకరులకు బాషండ మతప్రశమనమున నద్వైతమత స్థాపనమును, నద్వైతమత నిష్ఠాగరిష్ఠులయ్యు విద్యారణ్య సమర్థరామదాసప్రభృతులకు మతసంరక్షణమును నావశ్యకములగు రీతిని బ్రకృతకాలమున నాదిశంకరభగవత్పాదుల నామస్మరణమున నద్వైతిమతమును బ్రబోధించుటయే ముఖ్యకర్తవ్యమును, ధర్మమును నైయున్నది శ్రుతులును, శాస్త్రపురాణేతిహాసములును, వ్యవహారమును శివ విష్ణుభేదమును నిరూపించును. అద్వైతము హరిహరాద్వైతము, జీవబ్రహ్మాద్వైతమని రెండు విధములు. రామకృష్ణ వరాహనృసింహాది నామములును, దద్రూపములును భిన్నములయ్యుఁ దన్నామస్మరణమున మానసికగోచరమగు నేక మగు విష్ణువు నటుల, శివవిష్ణ్వాదినామములును, దద్రూపములును భిన్నములయ్యుఁ దదుపాసనమున మానసికముగ

(22)

నీశ్వరుఁ డద్వైతుఁడై భాసించు ననుట హరిహరాద్వైతము. జ్ఞాన్యనుభవైక వేద్యమును, సకలమహాప్రస్త వైరాగ్య గురూపదేశానంతర ప్రకాశ్యప్రబోధమును నగునదియే జీవబ్రహ్మాద్వైతము హరిహరాద్వైతమును గుర్తెఱిఁగి భగవద్ధ్యానమొనర్చుచు, గర్మల నెల్ల నీశ్వరార్పణము సేయుచు, జ్ఞానమార్జించి ముక్తులగుటకు యత్నింపవలయును. అని ప్రబోధించుచు నాద్యశంకరాచార్య నామసంకీర్తన మొనర్చిరి (పరిశిష్టము 6)

శ్రీజగద్గురువుల దివ్య తేజః ప్రసారమున సకలజనులును భక్తిపారవశ్యము నంది శ్రీవారిచట నున్నపదునేడు దినములును విడువక శ్రీపూజ్యపాదులను సేవించుచుండిరి ప్రతిదినమును మహామహోపాధ్యాయులగు సుబ్బరాయానంతకృష్ణశాస్త్రివర్యులును, మహామహోపాధ్యాయులును, బండితులునుగూడిన సభను స్వాహానదీక్షావసానము నుండి శ్రీఆచార్యచరణులు స్వామృదు మధుర వాగమృతమున సకలశాస్త్రసారమును వెదఁజల్లుచుఁ బండితలోకము ధన్యముం గావించిరి శ్రీపీఠాధీశులకు బ్రథమమున విజయనగరాస్థానమువారును, విజయనగరాధీశుల మాతృపాదులును బిక్షల నర్పించిన పిమ్మట పురజనులు పాదపూజాద్యర్చనలను, భిక్షలను గావించిరి.

ఆశ్వయుజ బ ౨ ఆదివారము బ్రాహ్మ ముహూర్తమున (1–11–1936 తేదీ తెల్లవారుజాము 4 గంటలకు) శ్రీచరణులు జనము నెల్ల స్వకరుణాకటాక్ష వీక్షణములం దనిపి,

(23)

యచటనుండి పద్మనాభము దర్శింప విజయము చేయునవసరమునఁ బురజన మోదకాంత మనుగమింపగ, సంస్థానముపై తమకుఁ గల పరిపూర్ణానుగ్రహము జూపి, యాజ్ఞనిచ్చి, జనమును మరల్చి తాము విజయము చేసిరి. సాక్షాచ్ఛంకరు లగు శ్రీభగవత్పాదుల విజయనగర విజయయాత్ర శ్రీవిజయనగర సంస్థానమును బవిత్ర మొనర్చిన దనుట స్వయముగఁ బ్రజల కనుభవైకవేద్యము.

1-11-1936 ఆదిత్యవారము నాఁటియుదయమున శ్రీచరణులు పద్మనాభక్షేత్రముఁ జేరి యచట గోస్తనీనదిలో స్నానమాచరించి, పిమ్మట జపపూజాది నిత్యానుష్ఠానముల నొనర్చి దేవుని సందర్శించిరి. శ్రీవారు సాయంకాలమునఁ ద్రిపురసుందరీ సమభ్యర్చనముం గావించిన పిమ్మట విజయనగరాధీశ శ్రీఆనందగజపతి మహారాజాస్థానమున వీణావాదనమున మిన్నలని వన్నెంగాంచిన వైణికావతంసు లగు వీణా వేంకటరమణదాసుగా రొనర్చిన వీణాగానముం గ్రోలి యాతని నెంతయుఁ బ్రశంసించిరి.

అపరరాత్రమునఁ బ్రస్థాన మొనర్చుచు నుదయకాలమున మార్గపరిసర గ్రామములందు వసించుచు శ్రీపూజ్యపాదులు గావించు విజయయాత్రాక్రమము కడుంగడు హృదయంగమమై యొప్పెడిని. పద్మనాభమునుండి భీమునిపట్టణమును, నానందపురమును గ్రమముగఁ జేరి, తాము విడిసిన చోటులందెల్ల భక్తులొనర్చు సపర్యాదికములను స్వీకరించుచు,

(24)

శ్రీపీఠాధీశు లాశ్వయుజ బ ౬ బుధవారము (4-11-36) నుషఃకాలమున సింహాచల మార్గముఁ బట్టి ప్రస్థాన మొనర్చిరి. సింహాచలక్షేత్ర పరిసరమున సకలజనులును, దేవస్థాన పండితులును శ్రీచరణులకు యథావిహితముగ స్వాగత మర్పించి, మంగళవాద్య స్వస్తివాచకములతోడ శ్రీవారిని గ్రామమునఁ బ్రవేశింపఁ జేసి హవేలీలో నిల్పిరి. అచట శ్రీవారు నిత్యానుష్ఠానము నెల్ల నొనర్చుకొని, పిమ్మట దేవస్థానమువా రర్పించిన భిక్షను స్వీకరించిరి.

సప్తమీ గురువారము (5-11-1936) ప్రాతఃకాలమున స్నానజపాదులం గావించుకొనిన పిమ్మట 7-30 గంటలకుఁ బరివారమెల్లఁ దమ్మనుగమింపఁగ శ్రీపూజ్యపాదులు పాదచారులై శ్రీసింహాద్రినాథు దర్శనమునకై సోపాన మార్గమున విజయము చేయుచు, మార్గమధ్యమున హనుమంతుని దర్శించి, సింహాద్రి నధిరోహించి, ప్రదక్షిణముగ దేవళమునుఁ జేరి యచటఁ బూజరులు యథావిధి నర్పించిన సింహాద్రినాథ ప్రసాద పరివేష్టనంబులను స్వీకరించి, పిమ్మట దేవాలయముం బ్రవేశించిరి. దేవాలయమునఁ బ్రదక్షిణ మొనర్చి, గర్భాలయముం బ్రవేశించి, శ్రీవరాహలక్ష్మీనృసింహేశ్వరుని సందర్శించి, సహస్రనామాద్యర్చనముల శ్రీపరమేశ్వరు నారాధించి, తత్ప్రసాదముల నందుకొని, క్రమముగ దేవాలయస్థ సకల దేవతలను దర్శించుచు వచ్చి, తద్దైవముల కభిముఖముగ ముహూర్తకాలము దేవస్థాన పండితులతో నిష్టాగోష్ఠిని శ్రీవా

(25)

రచట వసించిరి. "దుష్టశిక్షణమును, శిష్టరక్షణమును, ధర్మసంస్థాపనమును నొనర్పఁ బ్రత్యేకముగ నవతారములం దాల్చిన శ్రీవరాహనృసింహు లీయద్రి నేకరూపమున వెలసియుండుటను సింహాచల మెంతయు బూజ్యమును, బవిత్రమును నగు పుణ్యక్షేత్ర మని చెప్పుచు శ్రీఆచార్యచరణులు పరమేశ్వరుని సర్వశక్తిమత్వమును బోధించిరి. అచట గదలి శివాలయమున కరిగి, శ్రీత్రిపురాంతకేశ్వరస్వామిని దర్శించి, రుద్రాభిషేకాద్యర్చనముల నద్దేవు నారాధించి, తత్ప్రసాదముల నంది, పిమ్మట గంగధారకుఁ జని, తత్తీర్థోకముల దండస్పర్శన మార్జనములం గావించి, ప్రదక్షిణ పరిసమాప్తి నద్రిముఖభాగముం జేరిరి. అచట మనోహర భాసమానంబగు తమ డోలికపై నధిరోహించి, భక్తజనమెల్లఁ దమ్మనుగమింపఁ బ్రకృతిరామణీయకములం దిలకించుచు, సింహాద్రినుండి సోపానమార్గమున నవతరణ మొనర్చి. హవేలీలోఁ బ్రవేశించిరి పిమ్మట శ్రీచరణులు మాధ్యాహ్నిక స్నాన జప పూజాద్యనుష్ఠానముల నిర్వర్తించి, సాయాహ్నమున భక్తులను బ్రసాదదృష్టి ననుగ్రహించి, పండితగోష్ఠి సల్పి, తదనంతరమున రాత్రి పూజాది కృత్యముల నొనర్చిరి.

ఆశ్వయుజ బ ౮ శుక్రవారమున (6-11-36) గ్రామస్థులు శ్రీపాదుకలకుఁ బాదపూజ నొనర్చిరి. సాయంసమయమునఁ బండితు లొనర్చిన శాస్త్రప్రసంగముల నాలకించి, శ్రీజగద్గురువులు పిమ్మట శుక్రవార ప్రయుక్తము లగు శ్రీచంద్రమౌళీశ్వర త్రిపురసుందరీ దేవతాసమభ్యర్చనముల నెల్ల నఖండదీక్షం గావించిరి.

(26)

నవమీ స్థిరవారమున (7-11-36) నిత్యపూజావిధుల నిర్వర్తించుకొని, గ్రామవాసు లొనర్చిన భిక్షను స్వీకరించిరి. సాయాహ్నమున గ్రామవీధులం దుత్సవమున నెల్ల దేవస్థానపరివారమును, శ్రీజగద్గురువులను సింహాద్రినాథ తిరువీధ్యుత్సవమునందువలె సేవించి యనుసరించుచు, శ్రీపూజ్యపాదులకు మంగళహారతుల నొనర్చుచు, శ్రీఆచార్యచరణుల సంసేవన భాగ్యమున ధన్యులైరి. సకలజన మీయుత్సవముతోడ శ్రీభగవత్పాదులం బొలిమేరవఱకనుగమింపఁగఁ బరిసరజలాశయ ప్రాంతమున శ్రీచరణులు సాయంసంధ్యాద్యనుష్ఠానములం గావించుకొనిన పిమ్మట గ్రామవాసుల కనుజ్ఞ నిచ్చి, వారలను మరల్చి శ్రీశంకరభగవత్పాదు లనంతరవిజయయాత్రకై విశాఖపట్టణ మార్గమున విజయ మొనర్చిరి.

శ్రీసంస్థానము వారికి వచ్చెడి సింహాద్రినాథ గంధపుష్ప ప్రసాదము లన్నియు శ్రీపూజ్యపాదులకు సమర్పింపఁ బడుచుండెను. శ్రీపరమశివాంశసంభూత శ్రీశంకరభగవత్పాదుల పరిపూర్ణానుగ్రహముననే శ్రీవిజయనగరాధీశుల మాతృపాదులవారు శ్రీచరణుల సింహాచలక్షేత్ర యాత్రాసమాప్తిపర్యంత మాచార్యచరణుల నారాధించు భాగ్యముం బడసిరి.

ఇటుల నీధాతృ (1936) సంవత్సరమున విజయనగర సంస్థానము శ్రీ ౧౦౦౮ శంకరభగవత్పాదుల విజయమునకుఁ బాత్రమై పవిత్ర మయ్యెను



కాకినాడలోని పరిపూర్ణానందస్వామివారి శ్రీపీఠాన్ని సందర్శించిన స్వామివారు



కామాక్షిదేవి సమేత ఏకాంబరేశ్వరస్వామి ఆలయ సందర్శనం పెద్దాపురం-10/10/2022






పెద్దాపురంలో 10/10/2022 నాడు శ్రీ మట్టె ఆదినారాయణ శ్రీమతి నాగమణమ్మ కల్యాణ మండపంలో భక్తులను అనుగ్రహించిన స్వామివారు

పిఠాపురంలో 11/10/2022 నాడు శ్రీ కుక్కుటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్న స్వామివారు



పూజ్య శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు అవిశ్రాంతంగా చేస్తున్న విజయయాత్రా విశేషములు, అనుగ్రహభాషణములు, ఫొటోలు పొందుపరుస్తూ శ్రీ వి.ఎస్.ఆర్ మూర్తిగారు వ్రాసిన "విజయయాత్ర" అను పుస్తకమును అక్టోబర్ 12, 2022న స్వామివారు ఆవిష్కరించారు.

ప్రతులకు వీరిని సంప్రదించండి:

మోహన్ రావు +91 91545 30686; కిషోర్ +91 96424 10208

శ్రీ కంచి కామకోటి పీఠం, స్కందగిరి, హైదరాబాద్



స్వామివారు ప్రదక్షిణ మండపం సందర్శించిన సందర్భం



# మూకపంచశతి ఆర్యశతకం

- బాలాత్రిపురసుందరి చిర్రావూరి

*చిన్తితఫలపరిపోషణ చిన్తామణిరేవ కాంచినిలయా మే ।*
*చిరతరసుచరితసులభా చిత్తం శిశిరయతు చిత్సుధాధారా ॥3॥*

భావం : చింతింపబడిన ఫలములను ఇచ్చుటలో కాంచీపురము నందు నివసించు కామాక్షీదేవి చింతామణి వంటిది. చాలాకాలము చేసిన సత్కర్మాచరణముచే సులభముగా లభించునట్టిది. జ్ఞానమనే అమృతప్రవాహమైన ఆమె నా మనసును చల్లబరచుగాక!

బాలమనోజ్ఞా:- మనము మన కోరికలను సంకల్పిస్తేనే చాలట వాటిని చక్కగా నెరవేరుస్తుందట ఆ తల్లి. ఫలాలే కోరికలు. ఒక పని చేసి దాని ఫలితాన్ని కోరుకుంటాం మనం. ఆ ఫలితాన్ని అత్యుత్తమంగా ఇస్తుందట కామాక్షీదేవి. చాలాకాలము సత్కర్మలు చేస్తేనే ఆ తల్లి సులభముగా కరుణిస్తుందట. ఇంక ఆవిడ అనుగ్రహముంటే వేరు జన్మ ఉండదని భావము. జ్ఞానమనే అమృతధారారూపిణి యగు ఆ తల్లి అజ్ఞానమనే జాడ్యముతో రగులుతున్న నా మనస్సును చల్లబరచుగాక! ఇక్కడ 'సుధాధారాసారైః చరణయుగళాంతర్విగళితైః...' అనే శంకరులవారి సౌందర్యలహరీ గుర్తు వస్తుంది. కుండలినీ రూపంలో ఉన్న ఆ తల్లియే తన పాదాల వద్ద ఉన్న అమృతధారలతో ప్రపంచం అంటే సాధకుని అంతఃశరీరాన్ని తడుపుతూ ఉంటుందట.

*కుటిలకచం కఠినకుచం కున్దస్మితకాన్తికుంకుమచ్ఛాయమ్ ।*
*కురుతే విహృతిం కాంచ్యాం కులపర్వతసార్వభౌమసర్వస్వమ్ ॥4॥*

భావం : వంకర్లు తిరిగిన కేశములుతో, కఠినమైన వక్షోజములు గల, మొల్ల పూవు వంటి తెల్లటి అందమైన చిరునవ్వుతో కూడిన కాంతితో, కుంకుమ పూవు వంటి శరీరకాంతి గలగి, కులపర్వత శ్రేష్ఠుడగు హిమవంతుని సర్వస్వమైన ఆ కామాక్షిదేవి కాంచీపురము నందు విహరించుచున్నది.

బాలమనోజ్ఞా : ఇక్కడ అమ్మని మూడు వర్ణములు తో వర్ణిస్తున్నారు మూకకవి. వంకర్లు తిరిగిన ఆవిడ శిరోజాలు నల్లవిగాను, చక్కటి పలువరసతో కూడిన చిరునవ్వు తెల్లనిదిగాను, శరీరకాంతి కుంకుమవర్ణముతోను ప్రకాశిస్తోందని వర్ణన. వర్ణములన్నింటిలోనూ తెలుపు, నలుపు, ఎరుపు రంగులు ప్రధానమైనవి. ఇవి త్రిగుణాలకు ప్రతీక కూడా. ఆ తల్లి వక్షోజములు కఠినములైనవని వర్ణిస్తున్నారు. తల్లి తన శిశువు యొక్క ఆకలిని తన స్తన్యాన్ని అందించి తీరుస్తుంది. సూర్యచంద్రులు కామాక్షీదేవి యొక్క స్తనములు. వాటిచే లోకాలన్నీ పోషింపబడుతున్నాయని అర్థం. ఆ తల్లి కులపర్వతశ్రేష్ఠుడైన హిమవంతుని గారాలపట్టి. ఐనప్పటికీ భక్తుల కోర్కెలను తీర్చుటకు హిమాలయమునుండి కాంచీపురమునకు వచ్చి ఇక్కడే విహరిస్తూన్నదని భావము. *



అఖండమండలాకారం వ్యాప్తం యేన చరాచరమ్ ।
తత్పదం దర్శితం యేన తస్మై శ్రీగురవే నమః ॥

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

SRI CHANDRAMOULEESWARAYA NAMAHA

# SRI KANCHI KAMAKOTI PEETAM

Jagadguru Shankaracharya Swamigal
Shrimatam Samsthanam, Kanchipuram





# Vijaya Yatra
of
# Jagadguru Pujyashri Shankara Vijayendra Saraswathi Shankaracharya Swamigal
in
# ANDHRA PRADESH

## CAMP at MUKKAMALA


## 28th Oct. to 10th Nov. 2022

## Place of Puja

**Residence of Sri DLN Somayajulu**
**Door No: 2-120, Shivalayam Street, Near DCCB Bank,**
**Mukkamala - 533241,**
**East Godavari District, Andhra Pradesh**
**Phone: 9160004620**
**Alt. Phone: 8688779551, 7095488064**

**Location MAP Link:**
https://connect.kamakoti.org/yatra
(or Scan QR code to open MAP)

**Nearest Railway Stations:**
Rajahmundry Railway Station - 51 kms
Kakinada Railway Station - 70 kms
**Nearest airport :** Rajahmundry - 66kms




JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA